
# ధర్మసాధనం

## ఒక వాస్తవగాథ

-తురగా జానకీరాణి



"ఇంకా ఎప్పుడొస్తాడో ఏమో!" బిగ్గరగానే అనుకున్నది అనిత. ఆ వీధి విశాలమైన మట్టి రోడ్డే కానీ, ఇళ్లు మాత్రం ఇరుకు. ముందు అరుగు, వెనక ఒక పెద్ద రూము, ఆ వెనుక మెట్లు నాలుగు దిగితే పెరడు. అందులోనే మరుగుకు రెండు దడి గదులు.

ఆ ఒక్క గదిలోనే వంట, పడక. అనిత, మొగుడు, ఇద్దర ఎపిల్లలు. అనిత మొగుడు ఆంజనేయులు ఆమెను తెచ్చి ఇక్కడ కాపురం పెట్టి రెండు నెలలైంది. టైలరు పని చేసేవాడు. 'చేసేవాడు' అని ఎందుకు అనాలంటే, ఇరవై రోజులై అతను కనబడలేదు కనుక. 'ఏమైపోయినాడు నీ మొగుడు?' అని, పైజామాలు, జాకెట్లు, చిన్నపిల్లల చొక్కాలు, గౌన్లు కుట్టడానికి ఇచ్చిన చుట్టుపక్కలవారు అడగడం మొదలుపెట్టారు.

"ఊరికెళ్లాడు" అని చెప్పింది.

"ఏ ఊరికి?" అనడిగారు.

అనితకి తెలిస్తేగా-ఎక్కడికి వెళ్లాడో, ఎందుకువెళ్లాడో, ఎప్పుడు తిరిగి వస్తాడో పది రోజులు ఏదో నోటి కొచ్చినట్లల్లా చెబుతూ గడుపు కొచ్చింది.

వీధి అరుగు మీద కుట్టుమిషను పెట్టి కుట్టుకునేవాడు. ఆ మిషను రాత్రి రూము లోపల పెట్టుకునేవాడు. ఈ మధ్య బయటికి కూడా మిషను కనిపించకపోయేసరికి బట్టలిచ్చిన వాళ్లంతా తమ బట్టలు ఇచ్చేయని అడిగారు, ఇచ్చేసింది.

ఆంజనేయులు తనబట్టలతో పాటు ఇంట్లో దాచి ఉంచిన నాలుగొందల రూపాయలు కూడా పట్టుకుపోయాడు. అనిత నాలుగేళ్లనాడు ప్రేమ పెళ్లి చేసుకుంది ఆంజనేయులుని. ఇంట్లోంచి వెళ్లిపోయారు. ఎక్కడెక్కడో తిరిగారు. ఆంజనేయులు ఏదో సేల్స్ మన్ ఉద్యోగం చేసేవాడు. ఇరుకు గదుల్లో కాపురం. ఇద్దరు పిల్లలు, మూడేళ్ల కొడుకు, రెండేళ్ల కూతురు. డబ్బు చాలక చీకాకులు. అనిత వొంటి మీదున్న నాలుగు కాసులూ అమ్మాడు. కుట్టుమిషను కొన్నాడు, డబ్బులు అయిపోసాగాయి. సంపాదన సరిపోదు. పిల్లలకి ఏవో నలతలు, జ్వరాలు.

అనితకి చాకిరీ ఎక్కువై, తిండి తక్కువై అందం మాసిపోయింది. ఇంకా ప్రేమ ఏమిటి, వివాహం ఏమిటి? కాబట్టి ఆంజనేయులు. అనితనీ, ఆ పిల్లల లంపటాన్నీ వదిలించుకొని పారిపోయినాడని స్పష్టమైపోయింది.

అరుగు మీద నలభై పవరు బల్బు వెలుతురులో కూచుని "ఎపుడొస్తాడో ఏమో?" అని బిగ్గరగానే అనుకుంది అనిత.

ఎదురింట్లో అట్లాంటిదే అరుగు మీద కూచున్న బసవమ్మకి ఇప్పుడు పనేమీలేదు. వంట చేసి అన్నీ మూతలు పెట్టి కొడుకు కోసం ఎదురుచూస్తోంది. అరగంట నుంచీ అనితని చూస్తోంది. పక్కనే కీచులాడుకుంటున్న ఇద్దరు పిల్లల్నీ చూసింది.

ఈ అమ్మాయి కథ ఏమిటో, గడుసు గయ్యాళి బసవమ్మకి తెలిసింది. తన ఇంటి తలుపు చేరవేసి, ఎక్కువ వెడల్పు లేని ఆ చిన్న సందు అడ్డంగా దాటి అనిత దగ్గరికి చేరింది.

"ఏమిటే పిల్లా, దిగులుగా కూచున్నావు? ఆంజనేయులు రాలేదా?"

అనిత అడ్డంగా తలవూపింది. "అతను-నిన్ను, ఇద్దరు పసివాళ్లని వదిలేసి ఎక్కడికి పోయినట్టు? వాళ్ల అమ్మ, నాన్నను చూడపోయినాడా?" అన్నది బసవమ్మ.

అనితకి తెలిస్తేగా ఆంజనేయులు అమ్మ, నాన్న ఎవరో? జవాబు చెప్పకుండా కళ్లప్పగించి చూస్తున్నది. పిల్లలిద్దరూ అమ్మ దగ్గరికి వచ్చి ఒళ్లో కూచుని బసవమ్మ వంక చూస్తున్నారు.

"ఇట్టాంటి కథలు నాకు తెలుసు గానీ ఆంజనేయులు ఇంక రాడు, ఏడవమాకు" అన్నది బసవమ్మ-అనిత ఏడవడం మొదలెట్టకుండానే.

"వస్తాడమ్మా-వస్తాడు" అన్నది ఏడుపులోకి దిగిపోతూ.

"వస్తాడే అనుకో. డబ్బు సంపాదిస్తాడా-సరిపోతుందా? నేనో మాట చెబుతాను. చిత్తూరుకి పోదాం రా" అన్నది బసవమ్మ.

"చిత్తూరా? ఎందుకు?" కళ్లు పెద్దవి చేసి అడిగింది అనిత.

"చెబుతా గానీ, రాత్రికి పిల్లలిద్దర్నీ నేను తీసుకుపోతాను. నేను

చెప్పినట్టు విను. ఈ వీధిలో ఎందరో ఆడోళ్లు అట్లాగే ఉంటున్నారు. ఒక మినిటు కళ్లు మూసుకుంటే తెల్లారేసరికి రెండు వందల రూపాయలు."

అనర్గళంగా లోకమెరిగిన జాణ బసవమ్మ చెబుతోంటే ఆశ్చర్యపడింది అనిత. భయపడింది, అసహ్యపడింది.

"ఈ వీధికి తీసుకొచ్చి నిన్ను ఆంజనేయులు కాపురం వుంచినప్పుడే అనుకొన్నాను, అతనికి అన్నీ తెలుసునని. అప్పుడే నీతో చెబుదామనుకొన్నాను. తొందరగా పిల్లలకి అన్నంపెట్టి, నువ్వు తిను. సబ్బెట్టి ముఖం కడుక్కో, సిల్కు చీరె కట్టుకో. నా మాట విను. ఏమీ తప్పు లేదు. లోకమంతా ఎట్లా పోతే, మనమూ అట్లాగే పోవాలి. అద్దె కట్టకపోతే ఈ కొంప లోంచి తరిమేస్తారు. పిల్లలు ఆకలితో ఏడుస్తారు. దిక్కు లేకుండా పోతావు. నిండా పాతికేళ్లయినా ఉన్నాయో లేదో, ఎట్లా బతకాలి నూరేళ్లు?"

బసవమ్మ గొప్ప మాటకారి. సమయం, సందర్భమూ తెలిసి మాట్లాడుతుంది.

ఊపిరి లేనట్లు పడివున్న అనిత పిల్లల్ని చూసింది. వీధిలోకి ముంచుకొచ్చిన చీకటిని చూసింది. మాసిన తన చీరె చూసుకొంది. కొప్పు నిండా జాజిపూలు తురుముకొన్న బసవమ్మను చూసింది. ఎక్కడో కడుపులో, గుండెలో ఏదో నరం కదిలి, సడిలింది. బాధతో మెలితిరిగి, కాస్సేపటికి సర్దుకొంది.

ఆ రాత్రితో అనిత జీవితం మలుపు తిరిగింది. ముక్కూ, మొహం తెలియని వారు ఎవరో తనకి అతి దగ్గరై పోయినారు కొంతసేపు.

రాత్రి పిల్లలు లేచినా ఏడవరు. మంచి నీళ్లిస్తే తాగిపడుకొంటారు. తనకి తెలియని వ్యాపారంలోకి, తిరుగుడులోకి, పర్యటనలలోకి జారిపోయింది అనిత. అందమైన మనిషి, పది రోజులు సరైన తిండి పడడంతో నిగారింపుగా మెరుస్తోంది. చిత్తూరు వెళ్లింది. మదరాసు వెళ్లింది. మెరుపుగీత వున్న వంద నోట్లు కనుపిస్తున్నాయి.

"చీకటి పడుతుండగా తాళం చేత్తో పట్టుకుని, "నాకు పని వుంది వెడతావా?" అన్నది. ఆమె పని ఏమిటో అతనికి తెలుసు. సర్వధర్మాలూ నెరవేర్చవలసిన సాధనం శరీరం. ఆ శరీరం అణువణువూ ఉపయోగపడుతోంది. అన్నానికీ, వస్త్రానికీ, కన్నబిడ్డలకి పొట్టలు నింపడానికీ. నిలువునా అనిత వొంటిని చూశాడు. ఆంజనేయులు, పౌరుషం లేని ఆ మగాడు."

ఒక నెలరోజులు బసవమ్మ, ఆమె ఇతరబృందం పిల్లలిద్దర్నీ చూసుకొన్నారు. వేళకింత తిండి పడేస్తే ఆడుకొనేవారు ఆ పిల్లలు. 'అమ్మా' అని ఎప్పుడైనా ఏడిస్తే చాక్లెటు, బొమ్మలు ఇచ్చి ఊరుకో బెట్టేవారు, ఆ వీధిలోని ఆడవారు ఎవరో ఒకరు.

ఉన్నట్టుండి అనితకి తన తల్లి మీద, అన్న, వదినల మీద ధ్యాస పోయింది. అమ్మ ఎవరో వంటలాయన దగ్గర కూరలూ అవీ తరిగిస్తూ, పైపనులు చేస్తూ పొట్ట పోసుకునేది. అన్న వృత్తి బేవార్సుగాడు. చదువు లేదు, పని లేదు. కాయకష్టానికి వొళ్లు వంగదు. వేరే పనికి బుర్ర లేదు. జేబులు కొట్టడానికి, అప్పులు చేయడానికి వెనుకాడడు. వదిన నానాఅవస్థ పడుతుంది సంసారం ఈదలేక. అగరొత్తుల్లో, కొవ్వొత్తుల్లో, అగ్గిపెట్టెలో చేస్తూ ఏదో సంపాదిస్తుంది.

ఇలాంటి పరిస్థితుల్లోనే ఆరు చదివి, ఎదిగిపోయి, ఓణీలు కూడా సరిగ్గా లేక వీధిలో తిరగలేక అలమటిస్తున్న అనితకి, ఆంజనేయులు తగిలాడు. పెళ్లి చేసేందుకు నాన్నలేదు. అమ్మ మాట వినేవాళ్లు లేరు. బాధ్యత తెలియని గొడ్డు రకం మనిషి అన్నయ్య. పట్టించుకోడు.

అనిత, ఆంజనేయులు లేచిపోయారు. గుళ్లో పెళ్లి అన్నాడు. అది జరిగింది. అప్పటి నుంచి అమ్మ మీద బెంగ కలిగినా, వాళ్ల వంక చూసే అవకాశం లేదు అనితకి.

ఇప్పుడు ధ్యాస మళ్లీ, ఒక నాలుగు వందలు వదిన పేరు మీద మనీ ఆర్డరు చేసింది అనిత. వారం లోపుగానే అడ్రెస్సు పట్టుకొని అన్నయ్య వాలిపోయాడు.

కొంపలో ఆంజనేయులు ఉండటం లేదని గుర్తించాడు. అనిత ఎట్లా సంపాదిస్తున్నదీ అడగలేదు, గ్రహించాడు.

"అన్నయ్యా ఈ డబ్బులు తీసుకో. పిల్లలిద్దర్నీ వదినకి అప్పగించు. అమ్మకి చెప్పు; నేను బతికే ఉన్నానని. అమ్మను చూడాలనే ఉంది. ఎప్పుడు చూస్తానో తెలియదు. పిల్లలు బొత్తిగా వీధిన పడుతున్నారు తీసుకు పో" అంటూ ఐదువందలు ఇచ్చింది. అన్నయ్య కళ్లు మెరిసిపోయాయి.

"అన్నయ్యా, నువ్వు నీ జల్సాలకు ఖర్చు చేసినా సరే గానీ, ఈ పసిపిల్లల నోరు కొట్టకు. వాళ్లని బాగా చూసుకోండి. వదినకి ఎంతో ఓర్పు," అంటూ కళ్లల్లో నీళ్లు తిరుగుతుండగా చెప్పింది. "ధర్మం మరువకు అన్నయ్యా, పిల్లలకి అన్యాయం చేయకు" అని బతిమాలింది.

ఆ సాయంత్రానికి పిల్లలిద్దర్నీ తీసుకొని వాళ్ల మామయ్య వెళ్లిపోయాడు. ఒక్కసారి ఎక్కువ డబ్బులు కాకుండా అప్పుడప్పుడు మూడు వందలు, నాలుగు వందలు పంపిస్తూ, వదినకి కార్డులు కూడా వ్రాసింది. "నా పిల్లలకి నువ్వే దిక్కు" అని.

అనిత షోకులు నేర్చుకొంది. చిత్తూరు, మదరాసు దర్జాగా ప్రయాణాలు చేస్తుంది. లాడ్జిలో మకాం ఉంటుంది. బేరాలు ఉంటే పెద్ద హోటల్స్‌కీ వెడుతుంది. బసవమ్మ మీద ఆధారం పోయింది.

దారి పెడదారి, కానీ అది చూపించింది బసవమ్మే.

ఆంజనేయులు ఒకనాడు ప్రత్యక్షమైనాడు. మిషను తీశాడు. సాయంత్రానికి అమ్మేశాడు.

ఇల్లంతా చుట్టూ చూసి, "ఇల్లు బాగానే ఉంది కదా!" అన్నాడు, అది తన ప్రయోజకత్వానికి నిదర్శనమన్నట్లు. "పిల్లలు ఏరీ? మీ అమ్మ దగ్గరికి పంపేశావుట కదా!" అన్నాడు. హోటలు నుంచి అన్నం తెచ్చాడు.

ఉన్నా లేని మొగుడు. ప్రేమ, మోహం తీరిపోయాయి. అన్నీ ఒకనాడు. మళ్లీ ఇప్పుడు అన్నీ పుట్టుకొచ్చినట్లు ప్రవర్తించ సాగాడు. చీకటి పడుతుండగా తాళం చేత్తో పట్టుకుని, "నాకు పని వుంది వెడతావా?" అన్నది.

ఆమె పని ఏమిటో అతనికి తెలుసు. సర్వధర్మాలూ నెరవేర్చవలసిన సాధనం శరీరం. ఆ శరీరం అణువణువూ ఉపయోగపడుతోంది. అన్నానికీ, వస్త్రానికీ, కన్నబిడ్డలకి పొట్టలు నింపడానికీ.

నిలువునా అనిత వొంటిని చూశాడు ఆంజనేయులు, పౌరుషం లేని ఆ మగాడు.

ఎప్పటికీ తాను అన్యాయమైపోతున్నా, ముందు తరంలోని పాపలకు కొండ వంటి అండ, కల్పవృక్షం లాంటి వరదాయిని ఆ తల్లి. నైతికవాదులు తిట్టిపోస్తారా, శపిస్తారా ఆమె వృత్తిని గురించి విని!?